నమస్తే తెలంగాణ

# నిజామాబాద్



### ముఖ్యమంత్రి బహిరంగ క్షమాపణలు చెప్పాలి

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడిని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తీవ్రంగా ఖండించారు. ఈ విషయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుసరికాదని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నీచమైన రాజకీయాలకు తెరలేపిందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యమా, గూండా రాజ్యమా అనే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడికి సీఎం బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.



### రెచ్చిపోతున్న కాంగ్రెస్ గూండాలు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన కాంగ్రెస్ గూండాలను వెంటను అరెస్టు చేయాలని జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ వెనుక పెద్ద అస్త్రం ఉందని, ఆ అస్త్రం ప్రమేయంతోనే ఎమ్మెల్యేపై దాడి చేశారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రం పదేండ్ల పాటు పచ్చగా ఉందన్నారు. కొత్తగా కాంగ్రెస్ పాలనలో రౌడీయిజం బట్టబయలవుతుందన్నారు. సమావేశంలో నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ శంకర్, దాదన్నగారి సందీప్‌రావు, ఎనుగందుల మురళి, కాళీ చరణ్ పాల్గొన్నారు.



బాన్సువాడ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్‌ను అరెస్టు చేసిన పోలీసులు

# ఇదేనా ఇందిరమ్మ రాజ్యం?



సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ వద్ద మాజీ మంత్రులు వేముల, హరీశ్‌రావును అరెస్టు చేస్తున్న పోలీసులు



వేములను వ్యానులో ఎక్కిస్తున్న పోలీసులు

### కౌశిక్‌రెడ్డిపై దాడి హేయమైన చర్య

### ప్రజా పాలన అంటే దౌర్జన్యాలు చేయడమేనా?

### కాంగ్రెస్ హయాంలో సన్నగిల్లిన శాంతిభద్రతలు

### సర్కారుపై మండిపడ్డ బీఆర్ఎస్ నేతలు

ఖలీల్‌వాడి/నందిపేట్, సెప్టెంబర్ 12: ప్రశ్నిస్తే దాడులు.. నిలదీస్తే దౌర్జన్యాలు.. కాంగ్రెస్ పాలనకు ఇవే గీటురాళ్లు! బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం, న్యాయం చేయమని సీపీ ఆఫీస్‌కు వెళ్లిన ఎమ్మెల్యేలను అరెస్టు చేయడంపై గులాబీ శ్రేణులు భగ్గుమన్నాయి. బాధితుల వైపు నిలబడాల్సిన పోలీసులు వారినే అరెస్టు చేసి గంటల తరబడి రోడ్ల మీద తిప్పడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ చెప్పే ఇందిరమ్మ రాజ్యం ఇదేనా? ప్రశ్నిస్తే దాడు లు చేస్తారా? అని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, జిల్లాలో బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేయడం కలకం రేపింది. బాన్సువాడ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్‌ను గురువారం రాత్రి పోలీలు అరెస్టు చేసి, ఠాణాకు తరలించారు.

**రాష్ట్రంలో గాడ్సే పాలన**

రాష్ట్రంలో గాంధీ పాలన కాదు. గాడ్సే పాలన కొనసాగుతున్నదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ గూండాల దాడిని హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇందిరమ్మ హయాంలో దేశంలో ప్రకటిత ఎమర్జెనీ విధిస్తే, రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతున్నదని గురువారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై జరగుతున్న దాడులు రేవంత్‌రెడ్డి సర్కార్ దురాగతాలకు నిదర్శనమని, ఇందిరమ్మ రాజ్యమంటే ఇదేనా? అని ప్రశ్నించారు. కూకట్‌పల్లి నుంచి గూండాలు, రౌడీషీటర్లతో కలిసి 20 కార్లలో అరికెపూడి గాంధీ కౌశిక్‌రెడ్డిపై హత్యాయత్నం చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని నిలదీశారు. రూల్ ఆఫ్ లా ఉల్లంఘనలకు పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కొమ్ము కాసిన పోలీసుల పేర్లు పింక్ బుక్‌లో ఎక్కిస్తున్నామని, వచ్చేది కేసీఆర్ పాలనేనని, అప్పుడు అందరి లెక్కలు తేలుస్తామని జీవన్‌రెడ్డి హెచ్చరించారు. అరికెపూడి గాంధీతోపాటు ఆయన అనుచరులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడాన్ని బీఆర్ఎస్ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు దాదన్నగారి మధుసూదన్‌రావు ఖండించారు. ప్రజా పాలన అంటూ ప్రజాస్వామ్య విరుద్ధంగా పాలన చేస్తున్న కాంగ్రెస్‌కు సమాధి కట్టే రోజు దగ్గరలోనే ఉందనారు

- అద్దె గదుల్లో అసాంఘిక కార్యకలాపాలు
- పూర్తి స్థాయి నిఘా పెట్టని పోలీసులు
- అప్పుడప్పుడే తనిఖీలు.. ఆ తర్వాత షరా‘మామూలే’
- తాజాగా ఓ హోటల్‌లో పట్టుబడిన వ్యభిచార ముఠా

**కొన్ని పెద్ద హోటళ్లు** గలీజు పనులకు అడ్డాగా మారాయి. పేరొందిన లాడ్జీలు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రబిందువయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని హోటళ్లు, ప్రధానంగా నిజామాబాద్ నగరంతో పాటు శివార్లలో ఉన్న స్టార్ హోటళ్లలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. వ్యభిచారం, పేకాట కేంద్రాలకు అవి చిరునామాగా మారాయనే ప్రచారం జోరుగా సాగుతున్నది. అప్పుడప్పుడు పోలీసులు తనిఖీలు చేసి పేకాట శిబిరాలు, వ్యభిచార ముఠాల గుట్టు రట్టు చేస్తున్నారు. కానీ పూర్తి స్థాయిలో నిఘా లేకపోవడంతో మళ్లీ షరా‘మామూలే’ అన్నట్లుగా అక్రమాలు కొనసాగుతున్నాయి.

–వినాయక్‌నగర్, సెప్టెంబర్ 12


# బడా హోటళ్లలో గలీజు పనులు

## వ్యభిచారం, పేకాటకు అడ్డాగా మారిన లాడ్జీలు

**నిజామాబాద్‌లో** పేరొందిన స్టార్ హోటళ్లు పేకాట కేంద్రాలుగా మారాయి. కొంత మంది స్నేహితులు కలిసి హోటల్ గదిని అద్దెకు తీసుకుని రోజంతా పేకాడుతున్నారు. దానికి తోడు మందు, మాంసం గదికి తెప్పించుకుని ఎంజాయ్ చేస్తున్నారు. మరికొందరేమో గదులను రోజుల తరబడి అద్దెకు తీసుకుని పేకాటరాయుళ్లను పిలిచి పత్తాలు ఆడిస్తున్నారు. గతంలో ఒకటి, రెండుసార్లు పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు జరిగాయి. కానీ కఠిన చర్యలు చేపట్టక పోవడంతో పరిస్థితి ఎప్పటిలానే మారింది. ఏయే హోటళ్లలో పేకాట జోరుగా నడుస్తుందన్న విషయం బహిరంగ రహస్యమే. కానీ ఫిర్యాదు వస్తేనే పోలీసులు తనిఖీలు చేస్తున్నారు తప్పితే అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు, బడా హోటళ్లు, లాడ్జీల్లో తనిఖీలు నిర్వహించని పోలీసులు.. ఏదో మొక్కుబడిగా చిన్న హోటళ్లపై పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

**జోరుగా వ్యభిచారం..**

ఉమ్మడి జిల్లాలోని హోటళ్లు, లాడ్జీల్లో హైటెక్ వ్యభిచారం జోరుగా సాగుతున్నది. ఎక్కడెక్కడి నుంచో మహిళలను తీసుకొచ్చి ఇక్కడి లాడ్జీల్లో వ్యభిచారం చేయిస్తున్నారు. వాట్సప్‌లో అమ్మాయిల ఫొటోలను పంపిస్తూ, ఫలానా హోటల్‌కు రావాలని విటులను పిలిపిస్తున్నారు. తాజాగా డిచ్‌పల్లి శివారులోని హోటల్‌లో ఇలాగే వ్యభిచారం చేస్తుండగా, పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అయితే, ఫిర్యాదులు వస్తేనే లేదా ఇన్ఫర్మేషన్ ఉంటేనే రంగంలోకి పోలీసులు దిగుతున్నారు. ఎక్కడ చీమ చిటుక్కుమన్నా నిమిషాల్లో తెలుసుకునే వ్యవస్థ కలిగిన పోలీసులు.. ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న అసాంఘిక కార్యకలాపాల గురించి సమాచారం లేదని చెబుతుండడంపై అనేక అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి.




**మా దృష్టికొస్తే చర్యలు తీసుకుంటాం..**

బడా హోటళ్లలో తనిఖీలు చేస్తున్నాం. పేకాట, వ్యభిచారం లాంటి కార్యకలాపాలు సాగుతున్న విషయం మా దృష్టికి రాలేదు. అలాంటివి ఏమైనా ఉంటే తప్పకుండా దాడులు చేసి, చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. తప్పు చేసిన వారు ఎంత పెద్ద వారైనా వదిలే ప్రసక్తి లేదు. అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఉంటే మా దృష్టికి తీసుకురావాలి.

- రాజావెంకటరెడ్డి, ఏసీపీ

**స్టార్ హోటల్‌లో**

## హైటెక్ వ్యభిచారం

- గుట్టు రట్టు చేసిన పోలీసులు
- 8 మంది అరెస్టు.. నకిలీ కరెన్సీ లభ్యం

డిచ్‌పల్లి, సెప్టెంబర్ 12: డిచ్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధి బర్ధిపూర్ శివారులోని శ్రీకృష్ణ స్టార్ కాంటినెంటల్ హోటల్‌లో హైటెక్ వ్యభిచారం జరుగుతుందన్న పక్కా సమాచారంతో సీసీఎస్, డిచ్‌పల్లి పోలీసులు బుధవారం అర్ధరాత్రి దాడి చేశారు. 8 మంది విటులను, ఐదుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. విటులను అరెస్టు చేసి, యువతుల ను సఖి సెంటర్‌కు తరలించారు. నిందితుల నుంచి 13 ఫోన్లు, రూ.38,760 నగదుతో పాటు ఫేక్ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. అయితే, వీరి వద్ద నకిలీ కరెన్సీ పట్టుబడటంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరి వద్ద ఫేక్ కరెన్సీ ఎందుకు ఉంది ? ఎక్కడ నుంచి వచ్చింది? అన్న కోణంలో పోలీసులు విచారణ ప్రారంభించారు. హైటెక్ వ్యభిచారంలో పట్టుబడిన వారంతా ఆర్మూర్, మెండోరాతో పాటు కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లికి చెందిన వారు ఉన్నారు. మరోవైపు, హైదరాబాద్ ఫిలింనగర్‌కు చెందిన ఓ వ్యక్తిని సైతం అరెస్టు చేశారు. అతడే యువతులను తీసుకొచ్చి వ్యభిచారం చేయిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. వాట్సప్ గ్రూపుల్లో యువతుల ఫొటోలను పంపి విటులను రప్పిస్తున్నట్లు భావిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## నందిపేట్‌లో ‘ఏసీబీ’ కలకలం

నందిపేట్, సెప్టెంబర్ 12: నందిపేట పంచాయతీలో ఏసీబీ దాడులు చేయడం స్థానికంగా కలకలం రేపింది. నూతన ఇంటికి నంబర్ కేటాయించడానికి డబ్బులు డిమాండ్ చేసిన పంచాయతీ కార్యదర్శి నవీన్‌కుమార్.. ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. దీంతో మండల, గ్రామస్థాయి అధికారులతో పాటు సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. నందిపేట మండల కేంద్రానికి చెందిన సుభాష్ (ఆటో డ్రైవర్) బైపాస్ సమీపంలో పంచాయతీ అనుమతితో కొత్తగా ఇల్లు నిర్మించుకున్నాడు. అయితే ఆ ఇంటి నంబర్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి పలుమార్లు పంచాయతీ కార్యదర్శి నవీన్‌కుమార్‌ను సంప్రదిస్తూ వచ్చాడు. ఆ పని పూర్తి చేయడానికి నవీన్‌కుమార్ రూ. పదివేలు లంచం డిమాండ్ చేసి, రూ. 8 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో ఆటో డ్రైవర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. గురువారం డబ్బులు తీసుకుంటుండగా పంచాయతీ కార్యదర్శి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడు.



నిజామాబాద్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేవైఎం నాయకులు

## రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మల దహనం

కామారెడ్డి, సెప్టెంబర్ 12: విదేశీ గడ్డపై భారతదేశాన్ని, ప్రజలను అవమానించేలా రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఆయన దిష్టిబొమ్మలను దహనం చేశారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో రాహుల్‌కు వ్యతిరేకంగా బీజేపీ నేతలు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్‌గాంధీ మతి భ్రమించి మాట్లాడుతున్నారని పేర్కొంటూ ఆయన దిష్టిబొమ్మలు దహనం చేశారు. దేశ ప్రజలను అవమానించిన కాంగ్రెస్ నేత క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## రుణమాఫీ కోసం మరో పోరు

- ఈ నెల 16న తహసీల్ ఆఫీసుల ఎదుట ధర్నా
- రైతు ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు



ఆర్మూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న రైతు జేఏసీ నాయకులు

ఆర్మూర్‌టౌన్ , సెప్టెంబర్12: షరతుల్లేని రుణమాఫీ, రైతుభరోసా పథకం అమలు కోసం రైతాంగం మరో పోరాటానికి సిద్ధమైంది. కాంగ్రెస్ ఇచ్చిన రెండు హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న ధర్నా నిర్వహించనున్నట్లు రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రకటించింది. నిజామాబాద్ రూరల్, బాల్కొం డ, ఆర్మూర్ నియోజకవర్గాల్లోని అన్ని తహసీల్ ఆఫీసుల ఎదుట ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపింది. ఆర్మూర్‌లోని ఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం సమావేశమైన రైతు కమిటీ ప్రతినిధులు ఇట్టడి గంగారెడ్డి, నూతుల శ్రీనివాస్, దేగాం యాదగౌడ్, సుక్కి సుధాకర్, తిరుపతిరెడ్డి, అల్లూరి గంగారెడ్డి భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చెప్పినట్లు షరతుల్లేకుండా రూ.2 లక్షల రుణమాఫీతో పాటు రైతు భరోసా కింద రూ.7500 చొప్పున ఇవ్వడానికి తాము సెప్టెంబర్ 15 వరకు సమయం ఇచ్చామన్నారు. గడువు దగ్గరకొస్తున్నా ప్రభుత్వంలో చలనం కరువైందని మండిపడ్డారు. 15లోగా రైతులందరికీ రుణమాఫీ చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 16న అన్ని తహసీల్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాక పోతే రైతుల సత్తా చూపిస్తామన్నారు.

## వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలి

**డీఎంహెచ్‌వోకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశం**



డీఎంహెచ్‌వోను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

ఖలీల్‌వాడి(మోపాల్), సెప్టెంబర్ 12: జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందుస్తు చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, దవాఖానల్లో వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని, ప్రతిరోజూ ఉదయం వేళ అటెండెన్స్‌ను పర్యవేక్షించాలని సూచించారు. గురువారం ఆయన మోపా ల్ మండలం ముదక్‌పల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా విభాగాలతోపాటు మందుల నిల్వలు, స్టోర్ రూమ్, ఇన్‌పేషెంట్‌వార్డు, ల్యాబ్‌ను పరిశీలించారు. వైద్యులు, సిబ్బందిపై ఆరా తీయగా పలువురు అందుబాటులో లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. దవాఖానలో అందుతున్న వైద్య సేవలపై రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా పీహెచ్‌సీలో వైద్యాధికారి సెలవులో ఉంటే ఇతర దవాఖానల నుంచిసర్దుబాటు చేయాలని సూచించారు. పాముకాటు, కుక్కకాటు మందులతో పాటు అన్ని అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి విడుదల అవుతున్న మిగులు జలాలు

**ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో**

ఎస్సారెస్పీకి ఎగువ ప్రాంతం నుంచి వరద కొనసాగుతున్నది. గురువారం 40,945 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా..ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(80.5టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1091 అడుగుల (80.501టీఎంసీలు)నీటినిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి 40,945 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతుండగా, ప్రాజెక్ట్ నాలుగు గేట్ల ద్వారా 12,480 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు.

మోర్తాడ్ సెప్టెంబర్ 12

### కుక్క దాడిలో ఒకరికి గాయాలు

ఎడపల్లి, సెప్టెంబర్ 12 : కొన్నిరోజులుగా ఉమ్మడి జిల్లాలో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామానికి చెందిన నర్సింహులు గురువారం ఓ పని విషయమై స్నేహితుడితో కలిసి బైక్‌పై జిల్లా కేంద్రానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. మార్గమధ్యంలో మండలంలోని బాపూనగర్ వద్ద నర్సింహులుపై ఓ కుక్క దాడి చేసి గాయపర్చింది. దీంతో ఆయన ఎడమకాలికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే పీహెచ్‌సీకి వెళ్లి చికిత్స తీసుకున్నాడు. గ్రామాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉన్నదని, కార్యదర్శులు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరాడు.